# దేవరహస్యం

- డాక్టర్. ఎమ్. సుగుణారావు



బజారు నుంచి ఇంటికొచ్చిన కైలాసం జేబులోని నోట్లను తీసి కడగడం ప్రారంభించాడు. కడిగిన నోట్లను ఫ్యాన్‌గాలికి ఆరబెట్టాడు డ్రాయింగ్ రూమ్‌లోని టేబుల్ మీద. అవి ఎగిరిపోకుండా వాటిపై పేపర్ వెయిట్ ఉంచాడు. అరుంధతి ఆయన చేస్తున్న పనికి నోరెళ్లబెట్టింది. ఈ మధ్యనే కైలాసంలో వస్తున్న ఈ కొత్త మార్పులకు ఆమెకు మతిపోతోంది.

నిన్న ఎవరింటికో వెళితే వాళ్లు అరటిపళ్లు ప్లేట్లో పెట్టిస్తే వేడినీళ్లతో తొక్కలపై శుభ్రంగా కడిగి అరటిపళ్లు తిన్నాడు. ఆ విషయాన్ని చిలువలు పలువలుగా కల్పించి, ఊరంతా ప్ర ్రచారం చేశారు ఆయనో వింత ప్రాణి అని. ఇంట్లో ఏం చేసినా ఫరవాలేదు. బయటకు వెళ్లినప్పుడే అభాసుపాలు కావలసి వస్తోంది అనుకుందామె.

నలభయ్యేళ్ల భర్తలోని ఈ విపరీత ధోరణికి ఆమె కలవరపడుతోంది. తమకు సమస్యలు లేవు. ఇద్దరు కొడుకులూ సైనిక స్కూల్లో చదువుతున్నారు. ఆఖరి సంతానం ఆడపిల్ల. తప్పటడుగులు వేస్తోంది. కూతురి ఏడుపు వినిపించేసరికి చేస్తున్న పనిని ఆపి తలెత్తి చూసింది. పక్కింటి సుబ్బారావ్ గారి పదేళ్ల నానిగాడు రోజూ తన కూతురితో ఆడుకోవడం వాడికి సరదా.

భర్త కంఠం ఖంగుమంది. "ఛీ... వెధవాని, నీ మురికి వొళ్లుతో దాని దగ్గరకు చేరకు" కసురుకున్నాడ. వాడు బిక్క ముఖం వేసి అలాగే నిలుచున్నాడు. అది వాడి దగ్గరకెళతానని గొడవ చేస్తోంది. అయినా పిల్లదానిని ఆయనే ఎత్తుకుని ఏడుపు ఆపేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాడు. ఆయనకు ఎదురు చెప్పలేని నిస్సహాయత అరుంధతికి పిల్లదాని ఏడుపుతో ప్రాణం విలవిలలాడింది. అయినా ఏమీ చెయ్యలేక నిర్లిప్తంగా నిలుచుంది.

❋ ❋ ❋


కైలాసంలో దినదిన ప్రవర్ధమానమవుతున్న వినూత్న పోకడలు. తమ ఇంటి ముందు ఒక ప్లాస్టిక్ తొట్టెను ఏర్పాటు చేశాడు. దానిలో ఏంటిసెప్టిక్ లోషన్ కలిపిన నీళ్లుంచాడు. ఎవరైనా ఇంట్లోకి వచ్చే ముందు దీనిలో కాళ్లు ముంచి రావాలట. ఈ పద్ధతి అతను కోళ్లఫారంలో చూశాడు. ఫారాల్లో పెరిగే సంకర జాతి కోళ్లకు పరిసరాల ఒత్తిడిని తట్టుకునే శక్తి తక్కువ కనుక సందర్శకుల ద్వారా వాటికేమైనా అంటు వ్యాధులు రావచ్చు అనే ఉద్దేశ్యంతో అలా ఉంచుతారు. ఈయనా, బయటి వారి నుంచి వారి కాళ్ల ద్వారా తమ ఇంట్లోకి సూక్ష్మజీవులు రావచ్చేమోనని అలాంటి వ్యాధి నిరోధక చర్యలు చేపట్టడంతో ఇంట్లోకి వచ్చే అతిథుల సంఖ్య తగ్గిపోయింది.

అరుంధతి భర్తతో వాదించబోయింది. ఆయన చెప్పిన దానికి తిరిగి సమాధానం చెప్పే సాహసం ఆమె చెయ్యలేకపోతోంది. ఏమన్నా అడిగితే, అంతా మన మంచికే ఆరోగ్యం మహాభాగ్యం అంటూ ఉపన్యాసం దంచుతాడు.

❋ ❋ ❋

అసలే మండువేసవి. చిన్నపిల్లలు బట్టలు లేకుండానే ఉండడానికి ఇష్టపడతారు.

కైలాసం తన కూతురికి నెత్తి మీద టోపీ,




కాళ్లూ, చేతులకు సాక్సులు, ఉలెన్ స్వెట్టరు స్నానం చేయించేటప్పుడు తప్ప మిగతా సమయాల్లో ఉంచాల్సిందే. పిల్ల చిరాకుపడి ఏడ్చినా, చలికి పిల్లకు జలుబూ, ఆపైన బ్రాంకెటిస్ అని ఆయన అంతర్మధనం. ఆ చిన్న పిల్లకు వచ్చిన ఈ కష్టాలకు ఆ వీధిలో జాలిపడనివారు లేరు.


ఆ పిల్ల తన యథాశక్తిన ఏడుస్తూ రాత్రిళ్లు ఆ వీధిలో అందరికీ నిద్రాభంగం కలిగిస్తోంది. అరుంధతికి మతిస్థిమితం లేకుండా పోతోంది. కైలాసం ఆఫీసులో ఉపయోగించే కళ్లద్దాలనే భోజనం చేసేటప్పుడూ ఉపయోగిస్తాడు. ఆ భూతద్దాల కళ్లకు కంచంలో ఏ పురుగో, క్రిమో కనబడిన భ్రమ కలిగితే ఆ రోజు వండిన పదార్థమంతా పారబొయ్యాల్సిందే. సగం తిన్న తర్వాత సూక్ష్మజీవుల సందర్శనం అయితే తిన్నదాన్ని కక్కేసే ప్రయత్నం.

ఇలాంటి పిచ్చి చేష్టలు ఈయనలో ఇంత హఠాత్తుగా కలగడానికి కారణాలు ఆమె పరిశోధిస్తే — నెలక్రితం ఏదో హెల్త్ సొసైటీ వారు తమ ఆఫీసులో ప్రదర్శించిన సినిమాలో — జబ్బులు ఎలా సంక్రమిస్తాయి? ఏయే పరిస్థితుల్లో పరిసరాలు, గాలి, నీరు కలుషితమవుతాయి, వీటన్నిటినీ అధిగమించి జీవిత కాలాన్ని పెంచడం ఎలా? వంటి విషయాలు వివరంగా చూపించడంతోపాటూ, ఆ సినిమా తదుపరి అంశంగా రెండు గంటల ఉపన్యాసం విని వాటిని బాగా ఆకళింపు చేసుకుని, తానింతవరకూ అజ్ఞానంలో ఉన్నాననే బెంగతో అతను నూతనంగా చేపట్టిన కార్యక్రమాలివి. స్వతహాగా భయస్థుడు. వారి సినిమా, సినిమా తరువాతి మాటలు బలంగా నాటుకొనడంతో జరుగుతున్న కథ ఇదీ.

❋ ❋ ❋

తమ ఇంటి గుమ్మం ముందు అతడితో ప్రారంభమయిన సమస్యల పరంపర వంట గదిలోకి కూడా పాకింది. ఆమె వంట చేస్తున్నప్పుడు పక్కనే కూర్చుని కూరల్ని బాగా కడగమంటాడు. అలా అతిగా కడిగితే విటమిన్లు నాశనమవుతాయన్నా వినడు. సూక్ష్మజీవుల వినాశానికి పదార్థాలు బాగా ఉడికించాలి అంటూ వాటిని మాడ్పించేస్తాడు. ఇలా ఎన్నెన్నో సమస్యలామెకు.

కూతురు పడుకున్న గదిని 'ఇంక్యుబేటర్'లా తయారు చేశాడు. మంచం చుట్టూ ఎప్పుడూ ఫినాయిల్ చల్లుతూ ఉంటాడు. ఆ పిల్లను బయటకు కదలనివ్వడు. చుట్టుపక్కల వారు ఆ అమ్మాయికి 'పంజరంలో పసిపాప' అని నామకరణం చేసి యథాశక్తిన అతణ్ని ఏడిపిస్తున్నా చలించడు. తన పద్ధతి మార్చుకోడు. అతడితో వచ్చిన ఈ హఠాత్ మానసిక ప్రవృత్తికి ఆమె భయపడి ఓ సైక్రియాటిస్ట్ని కలిసింది. ఆయన ఓపిగ్గా ఆమె చెప్పిందంతా విని వాళ్లాయన కొచ్చిన జబ్బు పేరు "హైపోఖాండ్రియా" అంటే ఆరోగ్యాన్ని గురించిన అనవసరపు ఆందోళన అనీ, దీని గురించి బెంగపడాల్సిన పని లేదనీ — ఒకసారి అతణ్ని తనకు తీసుకువచ్చి



### అన్వేషణ

అబ్బాయి : మనం ఒక ఆట ఆడుకుందాం. నేనేమో అన్వేషకుణ్ణట. నువ్వేమో ప్రపంచానివట. నీ తల 'ఉత్తర ధ్రువం', నీ పాదాలు దక్షిణ ధ్రువమట.

అమ్మాయి : అందుకభ్యంతరం లేదు. నువ్వు మత్రం భూమధ్య రేఖకి దూరంగా ఉండాలట!

చూపించమనీ చెప్పాడు. ఈ విషయం భర్తతో చెప్పడానికి భయపడిందామె. అతడు మరింత తీవ్రతరమైన ఆలోచనలకు గురయ్యే ప్రమాదం ఉంది కనుక ఆమె తను సైకియాట్రిస్ట్‌ను కలిసిన విషయం రహస్యంగా ఉంచింది.

❁ ❁ ❁

ఓ రోజు రాత్రి టీవీలో లీనమైన కైలాసానికి ముక్కు పుటాలు బద్దలయ్యే వాసనొచ్చింది. అతడు తలెత్తి చూసేసరికీ భార్య గిన్నెతో బయటకు వెళుతుంది. అది బయటకు పారెయ్యడానికే అనుకున్నాడు. ఓ బిచ్చగత్తెకు దాన్ని వెయ్యడానికి తీసుకెళుతోందని అతడికి తెలీదు. ఆమె బయటనుంచి లోపలకు రాగానే — 'అంత వాసనొచ్చే వరకూ ఆ ఆహారం ఎందుకు దాచావ్' అరిచాడు కోపంగా.

"ఉదయం పనిమనిషి పట్టుకెళ్లమంటే మరిచిపోయింది పారెయ్యడం ఎందుకని ఆ బిచ్చగత్తెకి వేశాను" అంది భయపడుతూ.

"మైగాడ్! కుళ్లిపోయిన అన్నం వేశావా? పనిమనిషైనా, అడుక్కునే మనిషైనా మనిషే కదా. రేపొద్దునకల్లా ఈ ఫుడ్ తిన్నవాళ్లకి ఏ కలరానో వచ్చి చచ్చిపోతే ఆ పాపం ఎవరిది?" గట్టిగా అరిచాడు కైలాసం. ఆమె తను చేసిన పొరపాటు బాధపడుతూ నిలుచుంది.

"ఔను! అతడు చెప్పింది నిజమే! మనకు పనికిరానిదాన్ని మాత్రమే వాళ్లకు పడేస్తూ మనం గొప్ప దానకర్తలమనుకుంటున్నాం." అలా ఆమె ఆలోచనల్లో ఉండగానే అతడు బయటకు నడిచాడు. 'ఈ కుళ్లిపోయిన ఆహారం తినకుండా వాళ్లను ఆపుచెయ్యాలి' అనుకుంటూ వేగంగా నడవటం ప్రారంభించాడు కైలాసం.

రెండు వీధులు తిరిగినా వారి జాడ కనబడలేదు. పిచ్చిగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న అతనికి ఓ పాడుబడ్డ సత్రం అరుగు మీద కనిపించింది తన భార్య నుంచి బిచ్చంగా కుళ్లిన అన్నం పుచ్చుకున్న ఆ బిచ్చగత్తె. ఆ సత్రం చీకటిగా ఉంది. వారిని కొంచెం దూరంలోంచి చూసి ఆగిపోయాడు. దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలతో ఆ సత్రం అడవిలా ఉంది. 'ఈ చీకట్లో, పురుగూ పుట్రా మధ్య వీళ్ల బ్రతుకులు ఎలా సాగుతున్నాయో' అనుకున్నాడు. వారివైపు బాటరీ లైటు వేశాడు.

ఆ చీకట్లో నల్లగా, నీడలా ఉన్న ఓ చిన్నపిల్ల. ఆ పిల్ల ఒంటి మీద గుడ్డల్లేవు. ఆ పిల్ల ఎదురుగా గోచీ పెట్టుకున్న మగాడు, ఒక చిన్న గుడ్డ చుట్టుకున్న బిచ్చగత్తె. ఆ దయ్యాల స్థావరంలాంటి ఆ చీకటి సత్రంలో ఆబగా, ఆకలిగా తింటున్నారు ఓ మట్టి మూకుడులోని పదార్థాన్ని. వాళ్లు తింటున్నదేమిటో అర్థమై వాంతి రాబోయింది కైలాసానికి. తన కళ్ల ముందు కనిపిస్తున్న వారి దౌర్భాగ్యానికి జాలి కలిగింది.

"బాబూ! మీరు తింటున్నది కుళ్లిపోయిన అన్నం పారెయ్యండి" అని అరిచాడు.

వారదేమీ పట్టించుకోకుండా తింటున్నారు.

ఆ చీకటిలో మరి ముందుకి వెళ్లలేక ఇంటికొచ్చేశాడు.

ఆ రాత్రి కైలాసానికి నిద్దరపట్టలేదు. "సత్రంలో విషాహారం తిన్న ముగ్గురి దుర్మరణం" — అనే వార్త తను తప్పనిసరిగా వినాల్సొస్తుందని భయపడ్డాడు.

❁ ❁ ❁

తరువాతి రోజు సాయంత్రం పేపర్ చదువుతున్న కైలాసానికి 'మాదా కవళం తల్లీ' అనే కేక వినిపించింది. నిన్న రాత్రంతా అతడిలో కల్లోలం రేపిన బిచ్చగత్తె, ఆమె అయిదేళ్ల కూతురు.

"అమ్మా! మీరు నిన్న రాత్రి తిన్న ఆ ఆహారం వల్ల మీకేం అనారోగ్యం కలగలేదా? ఈ చంటిపిల్లను అలా బట్టల్లేకుండా చలిలో చంపుతావేం?" తను అడిగిన ప్రశ్నలో తన అవివేకం ధ్వనించినా ఏం మాట్లాడాలో తెలీక అలా అడిగేశాడు. ఆమె ఏం చెప్పగలదు? తమ దౌర్భాగ్యాన్ని అతడు వేలెత్తి చూపినందుకు ఆమె మాట్లాడలేదు. అతడు అడిగిన ప్రశ్నను అర్థం చేసుకున్నా, తిరిగి జవాబివ్వగలిగే జ్ఞానం లేదు.

"ఏ తిండి బడితే ఆ తిండి తినడం మాకు అలవాటైపోయింది బాబూ! ఏ తిండినయినా అరాయించుకునే శక్తి మా శరీరాలకుంది బాబూ. మా పిల్ల బట్టల్లేకుండా చలిలో తిరగడం ఈ ప్రకృతి నేర్పింది బాబూ!" అని ఆమె చెప్పలేకపోయింది. అక్కడి నుంచి కదిలి వెళ్లిపోయారు మౌనంగా.

చూస్తున్న కైలాసానికి తన కళ్లముందున్న అనుమానపు, అజ్ఞానపు పొరలు తొలగినట్లనిపించింది. ఇంటి గుమ్మం ముందున్న ప్లాస్టిక్ తొట్టెలోని ఏంటిసెప్టిక్ నీళ్లు పారబోసి లోపలకొచ్చాడు. కూతుర్ని ఎత్తుకుని బైటకు తీసుకొచ్చి 'నానీ' పాపతో ఆడుకోరా" అని పక్కింటి వారి అబ్బాయిని కేకేశాడు.

భర్తనే గమనిస్తున్న అరుంధతి, అతనిలో వచ్చిన ఈ కొత్త మార్పు వెనుక 'దేవరహస్యం' అర్థంకాక ఆశ్చర్యంలో పడింది. ◆



## తండ్రిని మించిన తనయుడు

ఎన్.టీ. ఆర్; అక్కినేని చిత్రాల తరంలో హీరోలు అందంగా ఉండే వారు. చక్కని క్రాపు, నీట్ గా డ్రెస్సులు...హీరో అంటే అలా ఉండాలి అనేవారు. చిరంజీవి, వెంకటేష్, నాగార్జున వచ్చేసరికి ఆ ధోరణి మారింది. హీరో రఫ్ గా మారి పోయాడు. పిచ్చి పిచ్చిగా జుట్టు, వెర్రి వెర్రిగా డ్రెస్సులు, మోటు మోటు డైలాగులు..ఈ ధోరణి వచ్చేసింది. అలాంటి సమయంలో అక్కినేనితో "ఈ ధోరణిలో మీ వాడు మిమ్మల్ని మించి పోగలడా? మీలాగ తట్టుకోగలడా?" అన్నారు.

"సందేహమే లేదు!కాలం మారింది. నా కంటే పెద్ద హీరో అవచ్చు!"

అన్నారు అక్కినేని—

అది ఇవాళ నిజం అయింది! నాగార్జున నిజంగానే తండ్రిని మించి పోయాడనే అనిపిస్తుంది.

'ప్రేమికుడు, జెంటిల్ మాన్' లాంటి సంచలన చిత్రాలు నిర్మించిన కె. టి. కుంజుమన్, ప్రపంచ సుందరి సుస్మితా సేన్ తో నిర్మించే తమిళ చిత్రంలో హీరోగా నాగార్జునను తీసుకోవడం సంచలన వార్తే! కోట్లాది రూపాయలతో నిర్మించే ఈ చిత్రం ఏప్రిల్ లో ప్రారంభించి, నవంబర్ లో విడుదల చేస్తారట! చిత్రం పేరు 'రక్షకన్.'

సేకరణ : సుధ